
77120



# నన్ను బ్రతకనీ

విజయలక్ష్మి మురళీధర్





లోకం నిద్రబోతోంది.

ఆ రైలు బండి తప్ప.

చకచకా, చరచరా ముందుకు సాగిపోతోంది.

చిమ్మ చీకటి

ఆ చీకటిలో దూసుకుంటూ ముందుకు వెడుతోంది.

అప్పటికే చాలా ప్రయాణం చేసి అలసిపోయిన ఆ రైలు బండిలోని ప్రయాణికులు నిద్రలో మునిగివున్నారు.

ఆకాశం మబ్బులు కమ్మివుంది.


రెండు రోజులనుండి విశ్రాంతి లేకుండా వాన కురిసింది.

ఎండిపోయిన వాగులూ, నదులూ, నూతులూ దాహం తీర్చుకున్నాయి హాయిగా.

అయ్యో!

ఏదో వాగు దూరంనుండి పొంగిపొర్లి ఉల్లాసంగా ముందుకు వచ్చేస్తోంది.

ఇప్పటివరకూ ప్రశాంతంగా ఉన్న ప్రకృతికి ఇదేం రోగం!



# కథల పోటీలో రెండో బహుమతి పొందిన కథ

మరి ఆ వాగు అడ్డుపడుతుందే ఈ రైలుకి!

కాస్సేపాగకూడదూ ఆ వాగు.

దాని తొందర దానిది.

ఎందుకో నా మనసు కీడుని శంకిస్తోంది!

ఏదో జరగబోతోంది!

నాకు ఆందోళనగా వుంది!

ఆ రైలు బండిలోని కొంతమందిని కబళించడానికి మృత్యుదేవత పొంచి వుందనిపిస్తోంది.

ఆ బండినే వెంటాడి యమభటులు వస్తున్నట్లుగా ఉంది.

ఛీ •— ఛీ ఎంత దారుణంగా ఆలోచిస్తున్నాను. ఆలోచనలకి కూడా హద్దూ పద్దూ ఉండాలి. లేదు — నాకెందుకో అనుమానం. స్థిమితంగా వుండలేకపోతున్నాను.

అయ్యో ఆ ప్రయాణం చేస్తున్న వారికి ఎలా చెప్పను లేనండని!

నాకు చేతకాదే!

నామాట వారికి వినిపించదే!

అయింది.

నేననుకున్నంతా అయింది.

ఢీకొంది ఆ నీటి వూపు ఆ రైలుని.

నేను కెవ్వుమన్న కేక గాలిలో కలిసిపోయింది.

కాస్సేపు నాలో చలనం లేదు.

ఏం చూస్తున్నాను?

అగ్గిపెట్టెల్లా విడిపడిపోయి, నీళ్లలో తేలుతున్న ఆ రైలు పెట్టెలని నేనెలా లాగిపట్టుకోను?

నా వల్లకాదే!

నా గుండెలు ఎగిసి ఎగిసి పడుతున్నాయి. అందరినీ రక్షించేయాలన్న ఆరాటంతో.

ఏం చేయను!

నాకా శక్తి లేదే!

కొట్టుకుపోతూ, నీళ్లలో తేలుతూ వున్న ఆ పెట్టెల వెంబడి ఈ గట్టుమీద పరుగులు పెడుతున్నాను కానీ అంతకంటే ఏంచేయగలను!

అదిగో గొంతులు వినిపిస్తున్నాయి.

అరుపులు!

ఏడ్పులు!

గావుకేకలు!

నేను కూడా వారితోపాటూ ఏడవగలను తప్పితే వారినెలా ఆదుకోను!

నీళ్ళు ఉక్కిరి బిక్కిరి చేస్తోంటే ఆఖరి శ్వాస పీలుస్తూ కూడా ఎవరో వచ్చి ఆదుకుంటారన్న ఆశతో చేతులు వూపుతున్నారు.

అంతకుముందు రాత్రే తన పిల్లలని బుజ్జగించి ముద్దలు తినిపించి ముద్దులిచ్చి నిద్రపుచ్చింది. ఇప్పుడు పిచ్చిదానిలా ఆ నీళ్లు నిండిపోతున్న పెట్టెలో వెదుకుతోంది తన చిన్నారి పిల్లలకోసం ఓ తల్లి. అలా వెదుకుతుండగానే ఆమె ముఖం కూడా నీళ్లలో మునిగిపోయింది.

ఎంత దారుణం!

ఎంత అన్యాయం!

నాకు ఏడుపు ఆపుకుందామన్నా వచ్చేస్తోంది.

ఆ భీభత్సంలో!

కుటుంబాలతో ప్రయాణం చేస్తున్నవారు తమవారికోసం వెతుకుతూ—

ఒంటరిగా ప్రయాణం చేస్తున్నవారు ఎక్కడో దూరంలో ఉన్న తమవారిని తలుచుకుంటూ.

ఏదో కక్షకట్టినట్లుగా వచ్చి తమని ముంచేస్తున్న నీటిలో ప్రాణాల్ని వదిలేస్తున్నారు.

నేను రోదించడం తప్పితే ఏమీ చేయలేను.

** ** **

గలగలా ప్రవహిస్తున్న నీటి శబ్దాన్ని వింటూ మోకాళ్లమీద తల పెట్టుకు కూర్చున్న నాకు తెల్లవారుతోందని పక్షులు కిలకిలమంటోంటే తెలిసింది.

తల ఎత్తిన నాకు కొండల చాటు నుంచి దొంగ చూపులు చూసుకుంటూ తలని పైకి పెడుతున్న సూర్యుడు కనిపించాడు.

నాకు నిజంగా సూర్యుడిమీద చాలా కోపం వచ్చింది.

ప్రకృతి తలపెట్టిన ఆ కిరాతకంలో తన పాత్ర ఏమీ లేదనీ, తాను అమాయకుడననీ చెప్పకోడానికి వెనుకాడడని నాకు తెలుసు.

ఏం ఒక గంట ముందుగా వస్తే సూర్యుడి సొమ్మేం పోయేది!

తాను ప్రసరించే వెలుగులో కొంతైనా అల్లకల్లోలం తగ్గి కొన్ని అయినా ప్రాణాలు నిలిచివుండేవి.

ఇప్పుడు ఎంత ప్రశాంతంగా ఉంది!

పద్దుమణిగిన ఏరు నంగనాచిలా ఉంది.

తడితో బిగుసుకుపోయివున్న చెట్లు సూర్యరశ్మి పలుకరించగా వళ్లు విరుచుకుని తమ సోయగాలని ప్రదర్శిస్తున్నాయి.

ఛీ, వాటికి సిగ్గుంటేగా అసలు.

అదిగో పాపం,

కొంత మంది బతికి బయటపడ్డారు.

కష్టంలో ఉన్నవారికి సహాయపడుతున్నారు.

పెట్టెలలో ఎవరన్నా బతికి వున్నారేమోనని వెతుకుతున్నారు.

పాపం దృఢంగా వున్న ఆ కిటికీ ఊచలనుంచి బయట పడలేక లోపలికి తోసుకు వచ్చిన నీటిలో ఆ ఇరుకులో ఎంత అవస్థపడుతూ ప్రాణాల్ని వదిలారో!

ఇష్టం వచ్చినట్లు పడివున్నారు ఆ పెట్టెలలో ఆ అమాయకులు శవ రూపంలో.

నా కళ్లలో నీరు ఆగటం లేదు.

ఆపుకునే ప్రయత్నం కూడా చేయలేదు నేను.

అక్కడ జరుగుతున్న దాన్ని నిదానంగా తిలకిస్తున్న నాకు ఏదో కోలాహలం వినిపించింది దూరంగా.

ఏమిటబ్బా!

దూరంగా గుట్టలమీదినుంచి జనం పరిగెత్తుకొస్తున్నారు.

హమ్మయ్య!

ఇక్కడి ఆర్తనాదాలు వారికి వినిపించాయన్నమాట.

అందుకే సహాయం చేయడానికి వారు పరుగు పరుగున వస్తున్నారు.

ఇంకా ఎక్కడైనా ప్రాణాలతో చిక్కుబడిపోయిన వారిని కాపాడతారు.

అంత దుఃఖభారంలోనూ ఏదో తేలికబడిన భావం కలిగింది.

కించిత్ ఆనందం కలిగింది.

హాయిగా వూపిరి తీసుకున్నాను.

అదుగోవచ్చేసారందరూ!

ఎంతమందో!

అదేమిటే!

వారి కన్నుల్లో సానుభూతి లేదే?

అదేమిటే!

అలా సంబరపడుతున్నారు?

అదేమిటే!

నీటిలోని ఆ కళేబరాలను తోసేసుకుని, వాటిని తొక్కుకుంటూ ప్రవాహం మధ్యలోకి వెళ్లిపోతున్నారు.

అదేమిటె! అలా తడుముతున్నారు ఆ జీవంలేని వారిని!

ఏదో పండుగ చేసుకుంటున్నంత ఉత్సాహంగా ఉన్నారు.

అయ్యో పాపం అని అనరే ఒక్కరూ!

ఏమిటి వారు చేస్తున్నది?

కొంత సమయం గడిచాక గానీ నాకు తెలియలేదు.


"సఫల్" ఎలక్ట్రానిక్ మోటార్ స్టార్టరు




ఆటో మేటిక్

* సింగిల్ ఫేస్ 0.5 H.P.- 3. HP
* D.O.L. 1 H.P. - 10 H.P.
* స్టార్ — డెల్టా 7.5. H.P. - 35 H.P.
* ప్రత్యేకతలు:


1. ఓవర్‌లోడ్ లోఓల్టేజీల నుండి మోటారుకు పూర్తి రక్షణ.
2. సింగిల్ ఫేస్ ప్రివెంటర్ స్టార్టరునందే కలదు.
3. కరెంటుపోయి, మరల రాగానే మన ప్రమేయము లేకుండానే తిరిగి స్టార్టు అయ్యే సదుపాయము కలదు.
4. బావిలో నీళ్ళు అయిపోతే స్టార్టరు, ఆటోమేటిక్‌గా ఆగి, మోటారును కాపాడుతుంది.
5. గ్యారంటీ సర్వీసింగ్ సదుపాయం కలదు.

వివరములకు సంప్రదించండి:

VIJAYALAKSHMI TRADE LINKS

TARNAKA, FLOT NO. 2, BLOCK NO.1,
BADAM APARTMENTS, 1st FLOOR.
OPP: NUTRITION LAB - LANE;
SOUTH LALAGUDA, SECUNDERABAD-17

గ్లాసు




ఆ మృతులని దోచుకుంటున్నారని.

వారిని చూస్తుంటే ఎగబడి శవాలని పీక్కుతినే పక్కలు గుర్తుకొస్తున్నాయి.

నా తల తిరిగిపోతోంది.

ఓ మనిషి ఇంకో మనిషిని దోచుకోడమా!

నాకెందుకో వారిని మందలించాలనిపించింది.

'ఆగండి, వద్దు, ఆగండి. వారిని ఒలవకండి. ఎందుకలా తీస్తున్నారు? ఆ సొత్తు వారి కుటుంబానికే చెందుతుంది.'

అదేమిటీ నేనిలా అరుస్తున్నా వినిపించుకోరు!

వారికి వేరే ధ్యాస లేదు.

వారి పనిలో వారు నిమగ్నమయివున్నారు.

ఒకచోట పనయిపోయాక ఇంకోచోటికి పోటీలుగా పరిగెదుతున్నారు.

నేను వీరిని ఆపలేను.

నన్ను వారు చూడటం లేదు.

అసలు నా ఉనికినే గమనించటం లేదు.

వారినలా చూస్తుంటే చాలా అసహ్యం వేస్తోంది.

అదుగో!

ఎవడది!

ఏం చేస్తున్నాడు?

ఆమె మెడలోని మంగళసూత్రం లాగేస్తున్నాడు.

ఆమె ఎవరూ!

సరస్వతి కదూ!

నాకు బాగా గుర్తు.

పెళ్లి.

ముక్కూ మొహం తెలియని ఓ ఇద్దరు మనుషుల్ని బలే గమ్మత్తుగా కలుపుతుంది.

కాలం గడిచి, మొగుడూ పెళ్లాల పాత్రలలో ఆరితేరాక, దంపతుల అసలు కోరికలూ, అలకలూ బయటపడతాయి.

అవన్నీ పరీక్షలు.

వాటిని గట్టెక్కి స్థిరపడటంలో వుంది గొప్పతనం.

అలాంటి అన్ని పరీక్షల్నీ దాటేసి మాటికి నూరు మార్కులు తెచ్చుకున్న వారిలో సరస్వతి ఒకర్తి.

ఏకాంతంలో భర్తనెప్పుడు కలుసుకున్నా, అతన్ని చుట్టుకుపోయి, అతని గుండెల మీద తలవాల్చి,! కళ్లు మూసుకుని ఓ కోరిక కోరడం ఆమెకి అలవాటు.

"ఏవండీ, నే చనిపోతే నాతోపాటూ మంగళసూత్రాలని కూడా పూడ్చేయండి."

"ఛ. ఏం మాటలవి? నేనూ నీతోనే వస్తాను. నన్ను ఒక్కడినీ వదిలి నువ్వెలా వెడతావు?"

ఆర్ద్రంగా అనేవాడు.

"నా తృప్తికోసం ఒక్కసారయినా ఊ అనరే" ఆమెలో అలక. అలకతోబాటూ ఆమె కంట్లో రెండు కన్నీటి బొట్లు.

"సరే బాబూ సరే." ఆమెనింకా దగ్గరగా లాక్కుని తన వేలితో ఆమె కళ్లనుండి కారిన నీటి బొట్లను విదిలించేవాడు.

ఆ మంగళసూత్రాన్నే ఆ కిరాతకుడు లాగేస్తున్నాడు.

'ఒరేయ్ వద్దురా. ఆమె భర్త ఆమె శవం కోసం వస్తాదు. ఆమె కోసం ఏడ్చాక కనీసం ఆమె కోరిక తీరుద్దామని మంగళసూత్రాలకోసం చూస్తాడు. అవి కనిపించవు. ఆమె పోయిందన్న దుఃఖం కంటే ఆమె కోరిక తీర్చలేకపోయానన్న వేదనతో జీవితాంతం వరకు కుమిలిపోతాడు.

తియ్యకు. తియ్యకు.

వాడెందుకు వినిపించుకుంటాడు!

చేతులు జోడించి నిల్చున్నాను వాడిముందు. నన్ను పట్టించుకునే స్థితిలోలేదు.

ఇంకా ఎన్ని దొరుకుతాయా అని ఆతృతగా ఇంకోవైపుకి పరిగెత్తాడు.

వాడేం చేస్తున్నాడు?

ఆ పాప నెత్తుకుని ఒడ్డుకి రాడేం?

వాడి చేతులు ఆ పాప చెవులకున్న రింగులని తియ్యడానికి ప్రయత్నిస్తున్నాయి.

వద్దు, కనీసం ఆ పసిపాపని వదిలేయి అంటూ వాడి చేతుల్ని పట్టుకున్నాను.

విదిల్చించేశాడు.
నన్ను తోసి పడేశాడు.

ఆ పాప.

మూడేళ్ల పాప.

బేబీ ముద్దు పేరు.

నెల రోజుల క్రితమే తమ ఇంటి దగ్గరున్న సర్జన్ దగ్గరకి తీసికెళ్లి చెవులు కుట్టించాడు వాళ్లనాన్న.

ఆ రంధ్రాలు చేయించుకుంటు న్నప్పుడు వేసిన నొప్పికి, డాడి, మమ్మీ అంటూ ఏడ్చింది.

ఎంతగానో ఓదార్చారు వారి బేబీని ఆ మమ్మీ డాడీలు. తరువాత చాక్లెట్లు కొనిచ్చారు.

ఇప్పుడు ఆ చెవులకున్నవి వూడిరావటం లేదని ఆ దుర్మార్గుడు చెవులని కోసేయడానికి సిద్ధం అవుతున్నాడు.

'ఆ పసిపాప నొప్పిని భరించలేదు వదిలెయ్.

నా అరుపుని పెడచెవిన పెట్టాడు.

ఒక్క వూపుతో లాగేసాడు వాటిని.

ఆ దృశ్యాన్ని చూడలేక కళ్లు మూసుకున్నాను.

ఒకవేళ ఆ పాప తల్లిదండ్రులే చూసివుంటే!

ఏరీ!

వాళ్లేరీ!

అయ్యయ్యో! పాపం!

నిర్వికారంగా ఎలా తేలుతున్నారో ఒక ఒడ్డున తల్లీ ఇంకో ఒడ్డున తండ్రీ.

ఇప్పుడు ఎవరి అవసరమూ ఎవరికీ అక్కరలేకుండా ఎలా విడిపడిపోయారో!

నేను ఏడుస్తున్నాను.

వెతుకుతున్నాను.

ఎవరూ పట్టించుకోవడం లేదు.

ఎవరికి తోచినట్లు వారు రిస్టువాచీలూ, ఉంగరాలూ, ఇతర వస్తువులు దోచుకుంటున్నారు.

ఆ జనం, శవాల్ని పీక్కుతింటున్న రాబందుల్లా వున్నారు.

ఛీ... ఛీ... వాళ్లు మనుషులా!

పిశాచాలు.

ఏమిటదీ!

అక్కడెవరూ!

నీటి ప్రవాహంలో కొట్టుకొని ఆ ఒడ్డుకి వచ్చిపడ్డారు ఆ ఇద్దరూ.

ఒకతను మెల్లిగా లేచి కూర్చున్నాడు.

పోన్లేపాపం!

బతికి బయటపడ్డాడు.

ఇంకొకతను ప్రాణాల్తో ఉన్నట్లు లేదు.

ఎవరతను?

రాంప్రసాద్ కదూ!

అయ్యో చచ్చిపోయాడా!

అతనేమిటి అలాగే కూర్చుండిపోయాడు?


అప్పటిదాకా రాంప్రసాద్‌తో కలిసి ప్రయాణం చేశాడు. అందుకే జరిగినదానికి షాక్ తిన్నట్టున్నాడు.

రాంప్రసాద్ అంత దూరం కొట్టుకువచ్చినప్పుడు కూడా ప్రాణాలు పోతున్నప్పుడు కూడా చేతిలోని బ్రీఫ్‌కేస్‌ని వదలలేదు.

ఏమిటి అతనేం చేస్తున్నాడు!

రాంప్రసాద్ చేతిలోంచి బ్రీఫ్‌కేస్‌ని లాగుతున్నాడు.

చేష్ట



నాకంతా అయోమయంగా ఉంది.

అటూ ఇటూ దొంగ చూపులు చూస్తూ దాన్ని లాగేశాడు.

'ఆగు ఆ పని చేయకు'

ఆ బ్రీఫ్‌కేస్‌లో డబ్బు వుంది. చాతనయితే వారింటికి చేర్చు.

రాంప్రసాద్ దాన్ని తమ్ముడికోసం తీసికెదుతున్నాడు—

తల్లిదండ్రులు చిన్నప్పుడే పోతే తమ్ముడిని అపురూపంగా పెంచుకున్నాడు.

ఇప్పుడు అతని పై చదువుల కోసం తనకున్న కాస్త పొలాన్నీ అమ్మేసి తన పిల్లల భవిష్యత్తుకూడా ఖాతరు చేయకుండా సర్వస్వం ధారపోయడానికి సిద్ధమయ్యాడు.

అటువంటి ఉన్నతుడిని దోచుకుంటున్నావా!

నీ చదువు కూడా నువ్వు చేసే వెధవ పనికి అడ్డురావడం లేదు.

మమతలు, ఆప్యాయతలూ, అనుబంధాలూ, రక్త సంబంధాలకి కూడా విలువలు తగ్గిపోతున్న ఈ రోజుల్లో గర్వంగా చెప్పుకోదగ్గ అనుబంధంరా ఆ అన్నదమ్ములది.

ఆ అన్న అర్థాంతరంగా కనుమరుగయిపోతున్నాడు.

కనీసం అతని లక్ష్యం నెరవేరనీ!

ఆ డబ్బునుపయోగించుకుని తమ్ముడు పైకి వస్తే ఆ అన్న ఆత్మ ఎంత సంతృప్తి చెందుతుందో నీకు వేరే చెప్పాలా!

ఇప్పటిదాకా నీతో ప్రయాణం చేశాడు.

కబుర్లాడుకున్నారు

పేకాట ఆడారు.

ఒకళ్లింటికి ఒకళ్లు ఆహ్వానించుకున్నారు.

అడ్రసు లిచ్చుకున్నారు.

అనుబంధాన్నీ, స్నేహాన్నీ పెంచుకున్నారు.

అంత తొందరగా మరచిపోయావా!

ఊహూ అతను ఆ అర్థింపుని లెక్కచేయలేదు.

ఆ డబ్బుని తన స్వంతం చేసుకున్నాడు.

రాంప్రసాద్ శవం ప్రక్కన కూర్చుని ఏడవడం తప్పనేం చేయలేను.

నా ఆవేదన నిముష నిముషానికీ పెరుగుతోంది.

ఇలాగే ఏడ్చి ఏడ్చి ఏమయిపోతానో!

అదుగో ఏదో వాహనాలు.

పోలీసులు.

ప్రాణం లేచొచ్చింది నాకు.

ఏడుస్తున్న నన్ను ఆదుకోడానికి వస్తున్నట్లున్నారు.

నెమ్మదిగా నాలోకొత్త శక్తి, నీరసం స్థానే చోటుచేసుకుంది.

విజిల్స్ వేసుకుంటూ ముందుకు పరిగెత్తుకొస్తున్నారు పోలీసులు.


అంతవరకూ కుక్కల్లా ఆ మృత జీవుల్ని పీక్కు తిన్న ఆ అలగా జనం చెల్లాచెదురైపోయారు.

దొంగ వెధవల్లారా మీ పనయిందిలే. మిమ్మల్నందర్నీ జైల్లో పెట్టేస్తారు.

రోగం కుదిరింది.

వారిని శిక్షిస్తారన్న దానికంటే, కొద్ది క్షణాల క్రితం దాకా ఓ అర్థంతో జీవించి, ఈ నిముషంలో దిక్కులేని వారిలా అర్థం లేకుండా పడివున్న ఆ మృతదేహాలనీ, గాయాలు తగిలి కదలేని వారిని ఆదుకుంటారన్న ఆలోచన నాకెంతో ఊరట కలిగించింది.

నేను కూడా వారితోపాటు




చేయివేద్దామని లేచాను.

ఏమిటీ! ఏమిటదీ! ఏం చేస్తున్నారు?

ఆ పోలీసులు ఏం చేస్తున్నారు?

ఆ జనాన్ని కుక్కల్ని తరిమినట్లు తరిమింది ఎందుకూ?

వారు మిగిల్చిన సొమ్ముల్ని పూర్తిగా స్వాహా చేసేందుకా?

గబగబా...

అదేదో దొంగలు, కావల్సిన విలువైన వస్తువుల కోసం ఇంటిని అల్లకల్లోలం చేసినట్లుగా...

హడావిడిగా...

ఆదుర్దాగా...

ఆత్రుతగా...

ఆబగా...

దోచుకుంటున్నారు.

వారి తీరు నాకు ఆశ్చర్యాన్ని కలిగించింది.

వారలా దయాదాక్షిణ్యాలు లేకుండా ప్రవర్తిస్తోంటే కడుపులో దేవినట్లవుతోంది.

అదుగో ఆమె దగ్గర ఎవరో పోలీసు.

ఆమె చేతుల్లో బిగుసుకుపోయిన ఆమె బిడ్డ.

మూడు నెలల పసిపాప.

రెండు శవాలూ అతుక్కుపోయి వున్నాయి.

ఎంత ఇదిగా పొదివి పట్టుకుంది ఆమె తన బిడ్డని?

మాటల్లో చెప్పలేను.

వారిద్దరినీ ఏం చేద్దామని?

నాకర్థం కావడం లేదు.

ఆ పసిపాప మెడలో సన్నటి బంగారుగొలుసు.

ఓ అదా వాడి ప్లాను.

దాన్ని తియ్యడం సాధ్యపడలేదు.

కొయ్యబారిన ఆ తల్లీబిడ్డల శవాల్ని విడదీయడానికి అష్టకష్టాలూ పడుతున్నాడు.

అలా విడదీస్తే కానీ ఆ గొలుసుని చేజిక్కించుకోవడం కష్టం.

వద్దురా, ఆగు,

ఆ పని మాత్రం చేయకు.

అంత క్రూరంగా వారిని విడదీయకు.

ఆమె ఈ మధ్యనే బిడ్డకి బారసాల చేసింది.

భర్త ఊరెళ్లిపోయినా తాను ఇంకొంతకాలం పుట్టింట్లో గడిపివెడుతోంది.

బారసాల రోజున తేలేదు కానీ కంసాలి రైలెక్కేముందు తెచ్చి ఇచ్చాడు ముద్దుగా అమ్మమ్మ చేయించిన గొలుసుని.

"ఏమండీ మన పాప ఎలా మెరిసిపోతోంది కదూ ఈ గొలుసుతో" అంటూ ఎప్పుడెప్పుడు భర్తకి చెబుదామా అని ఆరాటపడింది.

కానీ ఇప్పుడూ?

ఆమె గుండెల దగ్గర బిడ్డని అతి కష్టం మీద లాగేసాడు.

ఆ పాప దేహం తల్లినించి విడిపోయి దూరంగా కొట్టుకుపోతోంది.

నా గుండెలు మండిపోతున్నాయి.

నా పిడికెళ్లు బిగుసుకున్నాయి.

నా గుండెలు ఎగసి ఎగసి పడుతున్నాయి.

నేను భరించలేను.

నేను చూడలేను.

ఇలాటి రాక్షసుల్లాంటి మనుషుల్ని చూడటానికే బతికి వున్నానా?

నేనేం చేయను?

ఒరేయ్ నిన్నేం చేసినా పాపం లేదు.

వాడి చొక్కా కాలర్ పట్టుకున్నాను.

ఆంధ్రభూమి పాఠకులకు

గాంధిటెక్స్ టేలంట్ కాంటెస్ట్

ఆరవవారం పజిల్ ఫలితాలు

ఈవారం ఆల్‌కరెక్ట్‌గా రాసినవారు మొత్తం తొమ్మిదిమంది. వీరందరికీ గాంధిటెక్స్ కాటన్ శారీస్ పంపిస్తున్నాం.

విజేతలు: 1: వి. గిరిజారాణి (శ్రీకాకుళం), 2. ఎం. సత్యనారాయణ (నిజామాబాద్), 3. పి. సుప్రియ (హైదరాబాద్), 4. పి. కమల (దోమలగూడ), 5. బి. సుబ్బలక్ష్మి (సికింద్రాబాద్), 6. వి. వెంకమాంబ (గుడివాడ), 7. పి.యస్.జయారెడ్డి (విజయవాడ), 8. యస్. జంగమయ్య (హైదరాబాద్), 9. వై. విజయానందరావు (కర్నూలు).

సొల్యూషన్: 1. నిర్ణయాలు, 2. బాతాఖానీ, 3. కవ్వ, 4. కబురు, 5. చొక్కా, 6. పుచ్చకాయ, 7.కర్తవ్యము, 8. కర్షకులు, 9. భార్య, 10. కాంక్ష.

(గాంధిటెక్స్ టేలంట్ కాంటెస్ట్
7వ వారం ఫలితాలు వచ్చేవారం)

ఆవేశంతో వూపేశాను.

పీక నులిమేద్దామనుకున్నాను.

కానీ నాశక్తి ఏమూలకి?

నన్ను తన కాలిబూటుతో ఒక్క తన్నుతన్నాడు.

అల్లంతదూరంలో పడ్డాను.

బాధగా వుంది.

మెలికలు తిరుగుతున్నాను.

నేనేమైపోయినా ఫరవాలేదు కానీ, వారిని అందరినీ నరికి పోగులు పెట్టాలని వుంది.

ఆ కాకీ బట్టలని, ఎర్రటోపీని దిగజార్చేది ఇలాంటివారే!

పెట్టెలనీ, సంచులనీ విడదీసి వాటిలోని విలువైన వస్తువులని దాస్తున్నారు.

"ఎందుకలా తీసేస్తారు. వారి సంబంధీకులు వచ్చి తీసుకుంటారుగా!"

పాపం!

ఎవరో, నాలాటి పిచ్చివాడూ, మంచివాడూ అడుగుతున్నాడు.

వారొచ్చేదాకా మా దగ్గర జాగ్రత్తగా వుంచుతాం లేకపోతే పోతాయి.

అదే వారి సమాధానం.

ఆ సమాధానం అతన్ని తృప్తిపరిచిందేమో కానీ

అంతా ఘోరం, దగా, అన్యాయం, దోపిడీ అని గట్టిగా అరవాలనుంది నాకు.

నోరు పిడచకట్టుకుపోయింది.

లేచి వెళ్లివాళ్లందర్నీ శిక్షించాలని వుంది.

లేవలేకపోతున్నాను.

అన్నివిధాలా కృంగిపోయాను.

రక్షణ కలిగించవలసిన వ్యక్తులు బాధ్యతారహితంగా ప్రవర్తిస్తోంటే ఎవరూ వారిని నిలదీసి అడగరే!

లాభం లేదని నేనే లేచాను.

'దయచేసి నా మాట వినండి. ఏ ఆచ్ఛాదనా లేకుండా వున్న స్త్రీ కళేబరాలకి చాటు కల్పించండి ముందు. కావాలంటే ఆ తరువాత తీరిగ్గా కావల్సినంత దోచుకోండి.

వారూ, మీ తల్లులూ, అక్కచెల్లెళ్లూ, భార్యల లాటివారే. కొన్ని గంటల క్రితం వరకూ గౌరవ మర్యాదలతో జీవించివున్నవారే.

ఇప్పుడు వారిలో జీవం లేకపోయినా కొంచెం మర్యాద ఇచ్చినంత మాత్రాన మీకేం నష్టంరాదు.

అదిగో అక్కడెవరో దీనంగా పిలుస్తున్నారు.

వెళ్లి రక్షించండి.

బాబూ నిన్నే...

నాయనా నిన్నే...

నా మాట వినవయ్యా...

నేను గుండెలు బాదుకుని ఏడుస్తున్నా వినిపించుకోవడం లేదు.

అయినా నా పిచ్చిగానీ, బతికున్నవారికే గౌరవ మర్యాదలు ఇచ్చుకోవడం మానేశారు.

ఇలాటి మూగబోయిన మూర్తులకి మీరేం మర్యాద ఇస్తారు!

అబ్బా!

అమ్మా!

నన్ను తొక్కేస్తున్నారు.

టక టకలాడిస్తున్న వారిబూట్లతో నా మీదనించే నడిచేస్తున్నారు.

అయ్యా!

అమ్మా!

నన్నెవరూ చూడరే!

లేవనెత్తడానికి ప్రయత్నించరే?

వళ్లంతా పచ్చిపుండులా అయిపోయింది.

అప్పటికే ఎంతమందో ప్రజలు వచ్చి అక్కడ నిల్చున్నారు.

అందులో ఎంతమందో పెద్దలు.

గజదొంగల్ని అదుపులో పెట్టలేకపోయినా కనీసం నన్ను ఆదుకోవడానికి ప్రయత్నించవచ్చుగా!

నా శోకం రాళ్లనే కరిగిస్తుందే!

మీ మనసుల్ని తాకట్లేదా?

అయ్యో నన్ను లేపండి.

నన్నాదుకోండి.

నాకు బతకాలని ఉంది.

నా కన్నీళ్లు తుడిచి, నన్ను అక్కున చేర్చుకుని నన్ను వూరడించండని నేనేం అడగటం లేదు.

నాకంత స్వార్థంలేదు.

మీకు సాధ్యం కాదని చేయమని అడగటం లేదు.

ఎవరూ నా మాట వినరే?

అయ్యా నీకు దణ్ణం పెడతా!

అమ్మా కనికరించు!

బాబూ నన్ను లేపు.

చచ్చిపోతున్నాను.

మీరందరూ ఇంత పాషాణాలుగా ఎప్పుడు మారిపోయారు?

నా అవసరం లేదన్న మాట!

అందుకే కదూ నా జోలికి రావటం లేదు.

మిమ్మల్ని అని ఏం లాభం!

మిమ్మల్ని సృష్టించిన ఆ భగవంతుడిని అనాలి. మీతోపాటు మీ నేస్తంగా నన్నూ పంపాడు. మీరేమో నన్ను ఒంటరిగా వదిలేశారు. ఆ భగవంతుడికే బుద్ధిలేదు.

నన్నెందుకు సృష్టించాలి?

ఆ!

ఏమిటి బాబూ ఏదో అడుగుతున్నావు?

ఆ ఏమిటి?

నేనెవరా?

ఏమడిగావ్!

నేను ఎవరనా!

ఈ ప్రశ్నని విని ఇంకా వూపిరి తీస్తున్నానంటే నాకే ఆశ్చర్యంగా ఉంది.

అవును మీరందరూ, ధన వ్యామోహం, పదవీ వ్యామోహంతో మిమ్మల్ని మీరే మరచారు.

నేనెలా కనిపిస్తాను?

నేనెవరో చెప్పుకోవాల్సినంత ఖర్మ పట్టింది నాకు.

అసలు నాదే తప్పు.

మీరు ఛీ ఛీ అంటున్న మీకోసం పాకులాడ్డం నాదీ తప్పు.

ఇంతకుముందుకూడా ఎన్నిసార్లో నన్ను చులకనచేశారు. అయినా నాకు బుద్ధిరాలేదు.

నాకు సిగ్గూ శరం లేదు.

నేను.

నేనయ్యా—

మానవత్వాన్ని!

నన్నే గుర్తించలేదా?

నన్ను ఆదరించకపోయినా కనీసం గుర్తుపట్టకుండా నన్నెంత బాధపెడుతున్నారో మీకేం తెలుసు!

నన్నింత ఏడిపిస్తున్నారు కదూ!

నా ఉసురు తగులుతుంది మీకు.

పుట్టగతులు లేకుండా పోతాయిమీకు.

చూస్తూ వుండండి...

మెల్లిగా లేచాను వారినుంచి దూరంగా వెళ్లిపోదామని ఉద్దేశ్యంతో.

అందరూ వింతగా చూస్తున్నారు నన్ను.

వెనక్కి అడుగులు వేస్తున్నానే కానీ నాలో ఇంకా ఆశ!

ఎవరైనా వచ్చి నా చేయి పట్టుకుంటారని.


## కథలు రాయడం ఎలా?

ఎడిటర్ సీరియల్‌లో ఏం చెబుతారు? అనే ప్రశ్నకు ఇప్పుడిప్పుడే జవాబు దొరుకుతోంది. ఆ జవాబుల్లో ఒకటి — 'రాయడం ఎలా?' కథలు రాస్తున్నవాళ్లు — రాయాలని అనుకుంటున్న వాళ్లకి ఎడిటర్ సీరియల్‌లో సరికొత్త ఫీచర్ —'రాయడం ఎలా?'

వచ్చేవారంనుంచే

చదవండి

రాయడం ఎలా?